## పండగ బట్టలు -

పండగదినాలు దగ్గరకు వస్తున్నాయని ఓ కుడతా, ఓ పాజామా, కుట్టడానికని మేరవాడికి గుడ్డ యిచ్చాడు ముల్లా. కాని తీరా కుట్టినగుడ్డలు తెచ్చుకుందామని పోయేవరకు మేరవాడి ఉనికి జ్ఞాపకంలేకుండా పోయింది. యిక ఒక బజారులో ఉన్న మేరవాళ్ళందరిని "నేను గుడ్డలిచ్చానా మీకు"? అని వరసపెట్టి అడిగాడు. ప్రతివాడు "నాకు తెలియదు పొమ్మన్నాడు"

ఈ వేషమంతా చూస్తువున్న గుడ్డలు తీసుకున్న మేరవాడుకూడ "నాకు తెలియదు పో" అన్నాడు. ముల్లాకు ఏమీ తోచలేదు. తెల్లవారితే పండుగ. తలపట్టుకొని బజారులో కూర్చున్నాడు. యింతలో దారిన పోతున్న ఒకడు ముల్లాను చూచి "రంధిగా కూర్చున్నావేమి?" అనిఅడిగాడు. ముల్లా జరిగిన వాస్తవమంతా చెప్పాడు.

"అయితే ఒక యుక్తిచేయి" అన్నాడు బాటసారి. "నేను పాజామా కుడతా కుట్టుకూలి యివ్వవలసివుంది. తీసుకోండి అని ప్రతి మేరవాడి దగ్గరికిపో. ఎవడైతే కూలి తెమ్మంటాడో వాణ్ణి గట్టిగా పట్టుకో"

ముల్లాకు ప్రాణాలు లేచి వచ్చాయి. కూలి డబ్బులు చేతపట్టుకొని ప్రతి దుకాణముదగ్గరికిపోయి "పాజామ కుడతా కూలి తీసుకోండి" అని అరిచాడు. వీడికేమైన పిచ్చి వేసిందా అని తెరిమేసారు అందరు. గుడ్డలు దాచుకున్న మేరవాడు ఈ వేషమంతా చూచి "అప్పుడు గుడ్డలు యిచ్చి మరిచాడు. కూలి తీసుకోండి అని తిరుగుతున్నాడు. నిజంగానే వీడికి ఉన్మాదమేమైన లేచి ఉండవచ్చు" అని అనుకొని ముల్లాను పిలిచి "ఎక్కడ తిరుగుతున్నావు. కూలి డబ్బులు యిచ్చేది నాకే" అన్నాడు.

"ఓహో! మీరేనా...అయితే పదండి ఖాజీగారి దగ్గరికి".

"ఎందుకు" అన్నాడు మేరవాడు తెల్లబోయి.

"గుడ్డలు ముందు కాజేయడం, కూలి తరవాత కాజేయడం. ఏ న్యాయశాస్త్రములో ఉందో కనుక్కుందాము"

మేరవాడు గుండె చెదిరి, గుడ్డలు యిచ్చి ముల్లా రెండుచేతులు ఒగ్గపట్టుకున్నాడు.

ముల్లా విజయగర్వంతో అంగలువేస్తూ వెళ్ళిపోయాడు.

# నామీదిగౌరవం నాశనమైంది

రచన: చెరుకువాడ శ్రీరామమూర్తి

కళ్ళు తిరుగుతున్నట్టున్నాయి. గదంతా అదోలా మొద్దు గాజుగుండా చూచినట్లు కనిపిస్తోంది. మెదడు ఉత్సాహంతో మందంగా పనిచేస్తోంది.

అనుకోకుండా టేబిలుమీద ఆనుకొన్నాను. లైటు డిమ్ముగా, అందంగా అగుపిస్తోంది. నా స్పృహ లేకుండా, మెదడు ఆజ్ఞ లేకుండా చేతులు ఊపేశాయి. పుస్తకాలు చప్పుడుచేస్తూ చిందర వందరగా క్రింద పడిపోయాయి.

లేచి ఏరి టేబిలుమీద సర్దుదామనే ఊహ ఉంది కాని లేవలేను. నా మెదడు ఆజ్ఞ నిర్వర్తించే స్థితిలో లేవు నా అవయవాలు.

ఏమిటో ఆనందం ఉయ్యాలల్లో ఊగుతున్న ఉత్సాహం! సాగినకొద్దీ సంతోషం. గౌరవం! ఆరోగ్యం వార్నింగు చేస్తున్నాయి.

"డాక్టరు బాబు వస్తున్నారు" సుబ్బిగాడు అరిచాడు! రింగున మోగింది వాడి కేక!

బుద్ధిలేదు వాడికి త్రాగిన వాడిలా అలా!... టక్కున ఆగింది నా ఊహ!

నేను చేసిన పని! డాక్టరినించి ఎలా తప్పించుకోవడం?... తెలిసిపోతే...! ఎంత అప్రతిష్ఠ! రోగమని ఇతర్లనించి తప్పించుకో గలంకాని డాక్టరు? జోరీగా ఊహ పరిగెడుతోంది.

డాక్టరు వచ్చారు?

సర్దుకు కూర్చున్నాను.

కుర్చీలో తల వేల వేశానేమో? అలా అనుకొంటుంటే నా స్థితిలో ఉన్నవాళ్ళ వెర్రిచూపు బుర్రలో కదులుతోంది. ఇంకా ఆయన్ని కూర్చోమనలేదు!

"కూర్చోండి" అదిగో అనుమానంగా చూస్తున్నాడు.

"అలా ఉన్నారేం?" గ్రహించాడు.

హడావిడిగా ఉంది, అగౌరవం పొందుతున్నానప్పుడే!

"ఏమీ లేదు" తడబడుతూ అన్నా.

"నీరసంగా ఉన్నదంటే..." పరువు ప్రతిష్ఠ నాశనం అధోరణిలోనే మెదడు పనిచేస్తోంది.

"కొంచం పళ్ళ రసం తీసికోండి..." తెలిసిపోయింది ఎంతైనా డాక్టరు.